చతురంగయోధులు

[కథానిక]

= శ్రీ క్రొవ్విడి లింగరాజు =

వజీదాలీషా రాజ్యం. లక్నో నగరం పేద సాద అనే వివక్షత లేకుండా భోగవిలాసాల్లో మునిగి తేలుతోంది. ఆటపాటల్లో కొందరూ, నల్లమందు గంజాయి మొదలైన నిషాపదార్థాలతో కొందరూ ఆనందంగా కాలక్షేపం చేస్తూన్నారు. జీవితంలో ప్రతిరంగంలోనూ భోగం, విలాసం ఉట్టిపడుతున్నాయి. రాజకీయలోకంలో, సాహిత్యప్రపంచంలో, సాంఘిక వ్యవస్థలో, ఉద్యోగసద్యోగాల్లో, ఆహారవిహారాల్లో అన్నింటిలోనూ భోగపరాయణత్వం ప్రత్యక్షం. ప్రభుత్వోద్యోగులు విషయలోలురు. కవులు ప్రేమవిరహాలమీద తమ కవితాప్రభావాన్ని విజృంభింపజేశారు. జీవితావసరాలను సృష్టించే కమ్మరికుమ్మరివగైరా పారిశ్రామికులు అత్తరు, పన్నీరు, సురమా, బుక్కా, చందనం, గంధం వగైరా సుగంధద్రవ్యాలు తయారుచేయడంలో నిమగ్నులైనారు. అందరి కళ్లకూ భోగవిలాసం అనే మబ్బు కమ్మేసింది. లోకం ఏమయిపోయినా వీళ్ల కేమీ నిమిత్తంలేదు. కోడిపందేలు, డేగపందేలు, జూదాలు అవిచ్ఛిన్నంగా నడుస్తున్నాయి. కొన్నిచోట్ల కొన్నిచోట్ల చతురంగమహాసంగ్రామాలు. ఒక్కటేమిటి? పాదుషా మొదలు ఫకీరువరకూ మూడు పువ్వులూ ఆరుకాయలూగా ఉన్నారు. ఎంతవరకంటే? ఫకీరు కొక పైసా దొరికితే తిండిసామగ్రి కొనుక్కునేందుకుబదులు, నల్లమందో భంగో సేవించే స్థితిలో ఉంది. చతురంగంపాచికలు ఆడడంవల్ల మనుష్యుల బుద్ధి వికసిస్తుందనీ, కఠినసమస్యలను పరిష్కరించే సూక్ష్మాలు స్ఫురిస్తాయనీ వాదిస్తూఉండే వారు జనం. (అలాంటి సాంప్రదాయికులు ఇప్పుడూ ఉన్నారనుకోండి).

ఆలాంటి స్థితిలో మిర్జా సజ్జాదాలీ, మీర్ రోశన్ ఆలీ ఇద్దరూ తమ బుద్ధిని రాత్రింబగళ్లూ ఇలా వికసింప జేశారంటే ఆశ్చర్య మేముంది? ఇద్దరికీ పెద్దలబాపతు జాగీర్లున్నాయి. జీవనోపాధికి తడుముకోవాలసిన అగత్యమేమీ లేదు. ఇంట్లో ఊరికేకూచుని చేసే దేముంది? ఈ మిత్రుల దినచర్య ఏమంటే, ప్రొద్దున్నే లేచి అల్పాహారం చిత్తగించడం, సావట్లో తివాచీ పరచడం, చతురంగంపావు లమర్చుకోవడం, అక్కడనుంచి యుద్ధాని కుపక్రమించడం, ఎత్తుపై ఎత్తులు వేయడం! ఆ పైని రెండు ఝాములు కానివ్వండి, మూడుఝాములు కానివ్వండి, సాయంకాలం కానివ్వండి వాళ్ల కేమీ లక్ష్యమన్నమాట లేదు. వంటయిందని ఇంట్లోంచి కబుర్లు వస్తూనే ఉండేవి. "వెళ్లు. వస్తున్నా. పీట వెయ్యమను" అంటూ జవాబులు చెపుతూనే ఉండేవాళ్లు. చివరకు ఆ వంటవాడికి ప్రాణం విసిగి భోజనంకూడా చావిట్లోకే తెచ్చిపెట్టేవాడు. స్నేహితులిద్దరూ రెండుపనులూ కలిపే కానిస్తుండేవాళ్లు.

మిర్జాసజ్జాదాలీ ఇంట్లో ఎవరూ పెద్దవాళ్లు లేరు. అందుచేత ఆయన సావిట్లోనే ఈ యుద్ధం సాగుతూ ఉండేది. ఇంట్లోవాళ్లకుమాత్రం సుతలాం ఇష్టముండేది కాదు. వాళ్లకన్నమాటేమిటి, ఇరుగు పొరుగు నౌఖర్లు చాకర్లు, యావన్మందీకూడ చాలా హేళనగా మాటలాడుతూ ఉండేవాళ్లు. "గొప్ప ఆటరా బాబూ! కొంప గుండంచేసేస్తుంది. ఈ వ్యసనంలో తగులోక్కుండా దేముడు రక్షించాలి. కాని లేకపోతే ఎందుకూ పనికిరాకుండాపోతారు. ఇదొక పెద్ద తెగులు" అనుకుంటూ ఉండేవాళ్లు. మిర్జాబేగం తన భర్తను చివాట్లు

పెట్టడానికేమైనా సావకాశం దొరుకుతుందా అని చూస్తూఉండేది. కాని అవకాశం దొరికేది కాదు. ఆమె లోపల పడుండేది. బయట ఆట జరుగుతూనే ఉండేది. రాత్రి ఆమె నిద్రపోయాక మిర్జా లోపల ప్రవేశించేవాడు. బేగం తన కోపాన్ని అప్పుడప్పుడు నౌకర్ల మీద తీర్చుకొనేది.

"ఏం! తాంబూలం కావాలంటున్నారా? ఓహో! వచ్చి తీసుకెళ్లమని చెప్పు. భోజనానికే తీరుబడి లేకుండా ఉందేం? భోజనం తీసుకెళ్లి నెత్తినెయ్యండి. తింటే తింటారు, లేకపోతే కుక్కలకెయ్యండి" అంటూ విసుక్కునేది. కాని ముఖాముఖి కొచ్చేసరికి జావ అయిపోయేది. నోరు పెగిలేదికాదు. ఆమెకు నిజానికి మీర్ సాహెబుపైన వచ్చినంత కోపం తన భర్తమీద వచ్చేది కాదు. మిర్జాజీ భార్యదగ్గర తన నిర్దోషిత్వాన్ని స్థిరపరచుకోడానికి దోషం అంతా మీర్ సాహేబునెత్తిన పారేసేవాడుకాబోలు!

ఒకరోజున బేగంసాహేబాకు తలనొప్పి లంకించుకుంది. ఆమె దాసీని పిలిచి "సాహేబుగారినిలోపలి కోసారి రమ్మని చెప్పు. వైద్యుడిదగ్గర కెళ్లి కొత్త మందు పట్టుకురావాలి. త్వరగా వెళ్లు" అంటూ పంపింది. తీరా దాసీమనిషి వెళ్లి చెప్పేసరికి మిర్జా "వెళ్లు. వస్తున్నానని చెప్పు" అన్నాడు. బేగంసాహేబాది అసలే కోపస్వభావం. తనకు తలనొప్పిగా ఉంటే భర్త చతురంగమాడుతూ కూచోడమా అనే అహంకారంవల్ల కోపం మరీ ఎక్కువైంది. దాసీతో "పో. మళ్లీ వెళ్లి ఆయనగారికి తీరిక లేకపోతే నేనే వైద్యుడిదగ్గర కెడుతున్నానని చెప్పు" అని సందేశం పంపింది.

మిర్జా మంచి రసకందాయంలో ఉన్నాడు. రెండేరెండెత్తుల్లో మీర్ సాహేబుఆట కట్టేటట్టుంది. తెగ విసుక్కుంటూ "ఏం! అంత ప్రాణం కసిట్టిందా ఏమిటి? ఇంకేం తరువాయిలేదూ?" అన్నాడు.

మీర్ సాహేబు — ఏమిటయ్యా! లోపలి కోసారి వెళ్లిరాకూడదూ! ఆడవాళ్లతో వ్యాపారం చాలా సున్నితం సుమా!

మిర్జా—చిత్తం! అల్లాగే! వెళ్లకేం! రెండెత్తుల్లో మీ ఆట కట్టు.

మీర్—అయ్యో! ఆ కబుర్లకేంలెండి? ముందు మీజంతువుల్ని కాసుకోండి, తర్వాత ఆటకడుదురు గాని.

మిర్జా—ఎందుకూ? ఇదిగో కట్టేసే వెడతాను.

మీర్—మీరు లోపలి కెళ్లిరండి. అంత వరకూ నే నాడను.

మిర్జా—వెడతానండీ. తలనొప్పికేమిటి పెద్ద మందు? నాప్రాణం విసిగించడానికేదో వంక గాని.

మీర్— అరే, ఏమవనీ? ఆవిడసంగతి కనుక్కు తీరాలి.

మిర్జా—అల్లాగే! కానియ్యండి. ఈ ఎత్తెయ్యండి.

మీర్—వల్లకాదు. మీరు లోపలికెళ్లండి. ఆమె సంగతి కనుక్కొస్తేకాని నేను మొహరామీద చెయ్యి వెయ్యను.

మిర్జా సాహేబు విధిలేక లోపలి కెళ్లేడు. బేగం సాహేబా మొగం చిట్లించుకుంది. మూలుగుతూ "దిక్కుమాలిన చతురంగమంటే అంత వ్యసనం మీకు. ఇంట్లోవాళ్లు ఛస్తున్నా సరే ఆటలోంచి లేవాలనే బుద్ధి తోచనేతోచదు. మీలాంటివాళ్ళు ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా అంట" అంది.

మిర్జా—ఏం చెప్పను? మీర్ సాహేబు ఎంత చెప్పినా వినడాయె. అతిప్రయత్నంమీద ఆయన్ని వదిలించుకొచ్చాను.

బేగం-అవును. ఆయనకేమీ పనీ పాటా లేదు. అంతా తనలాగే అనుకుంటాడు. ఆయనకుమాత్రం పిల్లా జల్లా లేరూ? వాళ్ల నేమైనా వదిలిపెట్టేడా?

మిర్జా—ఆయనకుమహావ్యసనం. ఆయ నిక్కడికొస్తే నేనూ విధిలేక ఆడవలసివస్తోంది.

బేగం—ఏం? ఆడనని మొహంమీద చెప్పెయ్యకూడదూ?

మిర్జా—సరిసరి! పెద్దమనిషి. అన్నివిధాలా. వయస్సులో, హోదాలో, అన్నింటిలోనూ నాకన్న బెత్తెడెక్కువవాడుకాని తక్కువవాడుకాడు.

బేగం—అయితే ఆయనకు తగిన శాస్తి నేనే చేస్తాను. కోపం వస్తే రానియ్యండి, ఎవరికిభయం? ఏం? మన్నేమైనా పెట్టిపోషిస్తున్నాడా? ఒసే దాసీ! సావట్లో చదరంగంపావు లిల్లా పట్టుకురా! మీర్‌సాహేబుతో అయ్యా ఇంక ఆటకు రారనీ, తమరిని శలవుతీసుకోమన్నారనీ చెప్పు.

మిర్జా—ఏయ్, ఏయ్, వద్దుసుమా! అల్లాంటి పొరపాటు చెయ్యకుసుమీ. ఆయన్ని అవమానంగాని చేస్తావా ఏమిటి? దాసీ, ఆగు. ఎక్కడికి వెడుతున్నావు?

బేగం—ఏం? దాన్ని వెళ్లనియ్యరా ఏమిటి? మీరు దానికి అడ్డొసితే నన్ను చంపుకుతిన్నంత ఒట్టే ....అయితే, కానివ్వండి. దాన్ని అడ్డుకొట్టేరు కాని నాకడ్డురండి చూద్దాం.

ఇల్లా అంటూనే రివ్వుమని ఆగ్రహంతో బేగంసాహేబా సావట్లో కెళ్లింది. మిర్జా తెల్లమొగం వేశాడు. బీబీ కాళ్లా వేళ్లా పడ్డాడు. "ఇదిగో, నా మాట వినదూ! నువ్వక్కడి కెడితే హుస్సేన్‌మీద ఒట్టు. నా మీద ఒట్టు" అంటూ బ్రతిమాలేడు. కాని బేగం వినిపించుకోలేదు. సావడిగుమ్మందాకా చరచర వెళ్లింది. కాని సరాసరి పరాయిమొగవాడి ఎదుట పడడానికి కాస్త సంకోచించింది. సావట్లోకి తొంగిచూచింది. అదృష్టవశాత్తూ సావట్లో ఎవ్వరూ లేరు. మీర్‌సాహేబు పావులు అటూ ఇటూ పడేసి బయటికి వేంచేసి తన నిర్దోషిత్వాన్ని స్థిరపరచుకునేందుకా అన్నట్లు వీధిగుమ్మంలో పచారుచేస్తున్నాడు.

ఇంకేముంది? బేగం చెంగుమని సావట్లోకొచ్చింది. పావులు విరజిమ్మేసి నాలిగింటిని వీధిలో పారేసింది. లోపల్నించి గభాలున తలుపేసి గొళ్లెం వేసేసింది. మీర్‌సాహేబు వాకట్లో నుంచుని పావులు బయటపడడం చూచాడు. గాజుల గలగల విన్నాడు. సరే, బేగంసాహేబా అలిగిందని గ్రహించాడు. కిక్కురుమనకుండా ఇంటికి దారితీశాడు.

"చాలాతప్పుసుమా"అన్నాడు మిర్జా భార్యతో.

"తప్పా? ఈసారి ఇక్కడికి రానియ్యండి. చెప్తాను ఆయనపని. నిలబడ్డపాటుగా గెంటేస్తాను... ...మీరు చతురంగం ఆడుతూ కూచోండి; నేను ఇంట్లో పొయ్యిదగ్గర చాకిరీతో తలబ్రద్దలుకొట్టుకుంటూఉంటాను. ఏం? ఇప్పుడైనా వైద్యుడిదగ్గరకి తీసుకెడ్తారా లేదా? ఇంకా తలనొప్పిబాధగానే ఉంది."

మిర్జా ఇంట్లోంచి బయలుదేరేడు. సరాసరి వైద్యుడింటి కెళ్లడానికి బదులు మీర్‌సాహేబింటి కెళ్లేడు. జరిగిన యావత్తు కథా వినిపించేడు.

మీర్—పావు లెప్పుడు వీధిలో పడ్డాయో అప్పుడే గ్రహించాను. అందుచేతే వెంటనే పలాయనం చిత్తగించాను. చాలా కోపధారిలా కనుపిస్తుంది. అయితే మీరు ఆమెను నెత్తికెక్కించుకున్నారు. అది ఆట్టే మంచిది కాదు. బయట మీరేం చేస్తే ఆవిడ కెందుకూ? ఇంట్లో ఏర్పాట్లు చూడడం ఆమెపని. కాని మిగతావిషయాల్తో ఆమెకేమిసంబంధం?

మిర్జా—ఆగొడవల్లా వదిలెయ్యండి. ముందు కర్తవ్యం? మన సమావేశం ఎక్కడ?

మీర్—దానికేముంది బ్రహ్మాండం! ఇదిగో పెద్ద లోగిలి. సరే. ఇక్కడే వేద్దాం.

మిర్జా—కాని బేగంసాహేబాకు సమాధానం చెప్పడం కష్టమే! కొంపలో పడుంటేనే ఇంత జరిగిందే. ఇక ఇక్కడ మనం గ్రంథం సాగిస్తే బ్రతకనిస్తుందా?

మీర్—ఏమిటండీ మరీ! అరచుకోనియ్యండి. నాలుగురోజులు రుసరుసమంటుంది; అయిదోరోజున ఆమే సర్దుకుంటుంది. మీరుమాత్రం కాస్త నిదానించండి. అంతే.

౨

మీర్‌సాహేబు బేగంకు సాహేబు కొంపకు దూరంగా ఉండడమే ఇష్టం. దాని కేవో కొన్ని కారణా లున్నాయి. అందుచేతనే ఆమె ఎప్పుడూ ఆయనచతురంగవ్యసనాన్ని గురించి అంత అడిగేది కాదు. ఇంటికి బాగా ఆలస్యంగా వచ్చినప్పుడు మాత్రం కాస్త పల్చపల్చగా అంటించేది. ఆకారణం చేత మీర్‌సాహేబు తన ఇల్లాలు మహా వినయశీల, గంభీర అనే భ్రమలో పడుండేవాడు. కాని రాత్రిం బవళ్లూ సావట్లో తివాచీ పరచి చతురంగం ప్రారం భించేసరికి బేగంసాహేబాకు కష్టం కలగడం ప్రారంభ మైంది. ఆమెస్వేచ్ఛకు అడ్డంకలిగింది.

నౌఖర్లు చాకర్లుకూడా గుసగుసలాడడం ప్రారం భించారు. ఇంతవరకూ పనీ పాటా లేకుండా ఈగలు తోలుకుంటూ ఒకచోట పడుండేవాళ్ళు. కొంపలో కెవరొచ్చినా ఎవరు వెళ్లినా వాళ్ల కేగొడవా పట్టేది కాదు. ఇప్పుడు ఎనిమిది ఝాములూ ఒకటే హైరానా. తాంబూలం తెమ్మని ఒకసారీ, మిఠాయి పట్టుకురమ్మని ఇంకోసారీ ఏదో ఎప్పుడూ ఒక్కటే పని. హుక్కా సంగతి చెప్పనక్కరేలేదు. ప్రేమ పీడితుల హృదయా ల్లాగ రగుల్తూ ఉండాలసిందే. బేగం సాహేబాదగ్గర నౌఖర్లు గోలపెట్టడం ప్రారంభించారు:

"అమ్మగారూ! అయ్యగారి చతురంగం మా ప్రాణాల కొచ్చింది. పగలల్లా అటూ ఇటూ పరుగు లెత్తేసరికి మాకాళ్ళు బొబ్బలెక్కిపోతున్నాయి. ఒళ్లు హూనం అయిపోతోంది. ఇదేమి ఆటమ్మా! ప్రొద్దున్న కూచుంటే సాయంత్రమైనా కదలరాయె! ఏదో మనోల్లాసంకోసం రోజు కోగంటో అరగంటో ఎవరైనా ఏదైనా ఆడుకోవడం కద్దు కాని రాత్రిం బగళ్లూ ఆడేఆట ఇదేమిటి? కానియ్యండి; మేము ఫిర్యాదుకోసం చెప్పడం లేదు. తమ నౌఖర్లం. తమ రేమి చెయ్యమంటే అది చేతులుకట్టుకుచేస్తాం. కాని ఈఆటమాత్రం కొంపకు ముప్పుతెస్తుంది. ఈ వ్యసనం లో పడ్డవాళ్లు అయిపూ మచ్చా లేకుండా పోతారు. ప్రమాదం తప్పదు. ఒకళ్లను చూచి ఒకళ్లు చివరకు పేటపేటంతా ఈ గుండంలో పడిపోతారు. ఏలినవారి ఉప్పు తింటున్నాం కనుక ఇంతవరకూ చెప్పకోవలసి వచ్చింది. తమరి కీర్తికి కలిగే కళంకాన్ని విని మనస్సు పట్టలేకపోయాం. తర్వాత మీ ఇష్టం."

"అవును, నేనూ చూస్తూనే ఉన్నాను. నాకూ ఇష్టంలేదు. కాని ఏమిటి చెయ్యడం? నేను కాదు ఎవరు చెప్పినా ఆయన వినడు."

ఆ పేటలో ఇద్దరుముగ్గురు పాతకాలపువా ళ్లుండే వాళ్లు. వాళ్లు తమలో "ఇప్పుడేమీ లక్ష్యం ఉండదు. తర్వాత తెలుస్తుంది. మన ధనికుల అవస్థ ఇల్లా ఉంటే మన దేశాన్ని దేవుడు రక్షించాలి, అంతే. మన రాజ్యమే ఈ చతుర్గంగానికి ఎప్పుడో బలిఅయిపో తుంది." అనుకునేవాళ్లు.

రాజ్యంలో గగ్గోలు పుట్టింది. పట్టపగలు దోపిళ్లు ప్రారంభమైనాయి. ప్రజల గోడు ఆలించే దిక్కూ, పాలించే దిక్కూ లేదు. గ్రామాల్లోని సర్వ సంపత్తినీ లక్నోకు లాక్కురావడం, ఇక్కడ దాన్నంతా వేశ్యలకూ, త్రాగుడు మొదలైన వ్యసనా లకూ సమర్పించడం జరుగుతోంది. ఇంగ్లీషుకంపెనీ కివ్వవలసిన ఋణం రోజురోజూ పాపం పెరిగినట్లు పెరిగిపోతోంది. రాజరికం సరియైన బందోబస్తులో లేకపోవడంచేత పన్నులు బకాయిలుపడిపోయినాయి. కంపెనీతాలూకు రెసిడెంటు తరుచు మందలించడం ఆరంభించాడు. కాని విలాససాగరంలో మునగానాం తేలానాంగా ఉన్న లక్నో ప్రజలకు చీమకుట్టడం లేదు.

మీర్‌సాహేబుసావట్లో నెలలతరబడి చతు రంగం సాగుతూనే ఉంది. కొత్తనడకలు, వింతెత్తులు, చిత్రమైన మొహరింపులు, అభేద్యమైన వ్యూహాలు వీటిలో నిపుణులైనారు స్నేహితు లిద్దరూను. అప్పు డప్పుడు ఆటమధ్య మాటా మాటా వచ్చి పొరుపాలు పొరుపాలు ప్రజ్వర్లి చివరికి ఛీ అంటే ఛీ, తూ అంటే తూ అనుకోవడందాకా వస్తూఉండేది. కాని

వెంటనే రాజీపడిపోయి సర్దుకునేవారు. ఒక్కొక్కప్పుడు బలం విరజిమ్మేసి లేచిపోవడంకూడా తటస్థించేది. కాని నిద్రతో ఆ మాలిన్యాన్ని మరచిపోతూ ఉండేవారు. తెల్లవారడంతోటే మళ్లీ మీర్ సాహేబు సావట్లో మిత్రు లిద్దరూ చతురంగసన్నాహంలో పడుండేవాళ్లు.

ఒకనాడు స్నేహితులిద్దరూ మాంచి ఎత్తుల్లో నిమగ్నులై ఉండగా, పాదుషా సైనికోద్యోగి గుర్రం మీదనుంచి గుమ్మంలో దిగేడు. దిగుతూనే "మీర్ సాహేబుగా రున్నారా?" అని అడిగేడు. సాహేబుకు ప్రాణాలు ఎగిరిపోయాయి. ఏమికొంపమునకొచ్చిందో అని కంగారుపడడం మొదలెట్టేడు. ఎన్ని విధాల ఆలోచించినా కారణం ఆనలేదు. తలుపు గడియవేసుంది. నౌఖరుతో "ఇంట్లో లేడని చెప్పు" అని చెప్పాడు.

సిపా—ఇంట్లో లేకపోతే ఎక్కడున్నారు?

నౌ—ఆసంగతి నాకు తెలియదు. అయినా తమరొచ్చిన పని శలవిస్తారా?

సిపా—పని నీకు చెప్పేదేమిటి? మీర్ సాహేబును నిలుచున్న పళంగా తీసుకురమ్మని పాదుషావారి ఆజ్ఞ. సైన్యంలోకి మనుష్యుల్ని చేర్పించాలి. జాగీర్దారంటే వేళాకోళమా? యుద్ధంలో ముందుకు దూకాలి. అప్పుడు తెలుస్తుంది అయ్యగారి పస.

నౌ—చిత్తం. తమరు దయచెయ్యండి. అయ్యగారితో మనవిచేస్తాను.

సిపా—మనవిచేయడాని కేమీ లేదు. రేపు నేను మళ్లీ వస్తాను. ఖుద్దున తీసుకురమ్మని పాదుషావారి హుకుం.

సిపాయి వెళ్లిపోయినాడు. మీర్ సాహేబు గుండెల్లో దడదడ ప్రారంభమైంది. "ఏమిటి కర్తవ్యం" అన్నాడు మిర్జాతో.

మిర్జా—నాకూడా పిలుపొచ్చిందా కొంప మునిగిందన్నమాటే.

మీర్—దౌర్భాగ్యం! మళ్లీ రేపు వస్తానంటూ పొయ్యాడే వీడు?

మిర్జా—ముప్పే. సందేహమేమిటి?...యుద్ధంలోకి దూకాలసొస్తే చచ్చే చావే!

మీర్—ఉందిలే దీనికీ ఒక యుక్తి. ఇంట్లో మనం దొరికితేకదా వాడు తీసుకెళ్లడం? రేపటినుంచి గోమతిఒడ్డున పాడుకొంపల్లో ఒకదానిలో చీడీ పరుద్దాం. అక్కడికి ఎవ్వరి కబురూ అందదు. సిపాయి వస్తాడు; వెడతాడు. అంతే.

మిర్జా—బలే బాగా తోచింది ఊహ. అదే యుక్తి. మరొకటి కనుపించడం లేదు.

ఆ వచ్చిన రౌతుతో మీర్ సాహేబు బేగం "బాగా దౌడెత్తించావుకాదూ" అంది.

"ఆహా! ఇల్లాంటి మూర్ఖులను నూరుమందిని చిటికెనవ్రేలిమీద ఆడించగలను. వీళ్ల తెలివితేటలు, ధైర్యం చతురంగంలో ఉపయోగపడుతున్నాయి. ఇక పొరపాటునకూడా కొంపలో ఉండరు" అంటూ వెళ్లిపోయాడు సిపాయి.

3

మర్నాడు భాయీ లిద్దరూ మొగాలు దిగాలేసుకుని గుమ్మంలో నిలబడ్డారు. ఒక చిన్న కంబళీ చంకనెట్టుకున్నారు. పాన్‌దాన్ చేత్తో పుచ్చుకొని గోమతి ఒడ్డున పాడడిన మసీదుకు ప్రయాణమైనారు. దారిలో పొగాకు, గంజాయి వగైరాలు సమకూర్చుకుని మసీదుకు చేరుకున్నారు. కంబళీ పరచి చతురంగాని కుపక్రమించారు. అంతే. ఇక వాళ్లకూ, బయటి ప్రపంచానికీ సంబంధమే లేదు. రాజు, త్రోసి రాజు, కట్టు మొదలైన వేవో రెండుమూడు మాటలు తప్ప మారుగొడవే లేదు. యోగీశ్వరేశ్వరులు సమాధిలోనైనా ఇంత ఏకాగ్రంగా ఉండలేరు. రెండుఝాములు తిరిగి కాస్త ఆకలైతే దగ్గరలో ఉన్న ముసలమ్మ రొట్టెల దుకాణంలో కాస్త మంచిమాట చేసుకుని తిరిగి యుద్ధరంగంలో పడేవాళ్లు. తరుచు ఆ భోజనం ధ్యాసకూడా ఉండేదకాదు.

దేశంలోని రాజకీయ వ్యవహారాలు భయంకరావస్థలో పడిపోతున్నాయి. నగరంలో గలభా హెచ్చయిపోయింది. కంపెనీసేనలు లక్నోమీదికి చొచ్చుకొస్తున్నాయి. పిల్లా మేకలతో సహా జనం గ్రామాలకు పారిపోతున్నారు. కాని మన చతురంగయోధులకిద్దరకూ చీమచిటుకనడం లేదు. ఇంట్లోంచి వచ్చేటప్పుడు పాదుషాతాలూకు ఉద్యోగస్థులకండ్లబడకుండా దొంగల్లాగ సందుల్లో గొందుల్లో పడి మెల్లగా మసీదు చేరుకునేవాళ్లు. సాలుకు వేలకొద్దీ ఆదాయాన్ని యిచ్చే జాగీర్లను ఊరికే కూచుని జీర్ణం చేసుకోవాలని వాళ్ల సంకల్పం.

ఒక్కరోజున ఆ పాడుమసీదులో కూచుని చతురంగం ఆడుతున్నారు మిత్రులు. మిర్జాఆట కొంచెం లీతుగా ఉంది. మీర్‌సాహెబు రాజుమీద రాజు చెపుతూ డేకిస్తున్నాడు. ఇంతలో కంపెనీ సేనలు లక్నోమీది కొస్తున్నాయి.

మీర్—అరే బాబా! ఇంగ్లీషుసేన లొచ్చిపడుతున్నాయే!

మిర్జా—రానియ్యండి! రాజుని తప్పుకోండి ముందు. ఇదిగో రాజు.

మీర్—కొంచెం ఉండవయ్యా! ఇదిగో ఈమూల కొచ్చేయి సేనలు.

మిర్జా—తొందరేముంది! ఇదిగో శాహ!

మీర్—ఫిరంగులుకూడా ఉన్నాయే. ఎంతలేదన్నా అయిదువేలమంది ఉంటారు. మంచి జవానులే. మనుష్యుల వైఖరి చూస్తేనే హడలెత్తుతోంది.

మిర్జా—ఈ వంకల కేమిలెండి! ఈ డొంక తిరుగుడు కబుర్లు మరెవరితోనైనా చెప్పండి. ఇదిగో రాజు.

మీర్—మీరు చాలా చిత్రమైన మనుష్యులండీ! అక్కడేమో పట్టణంమీద ముప్పొచ్చిపడుతోంది. ఇక్కడ మీకు రాజుతప్ప మరోగొడవ లేదు ...కొంచెం ఈ సంగతికూడా ఆలోచించండి. నగరం ముట్టడైపోతే కొంపకు చేరుకోవడ మెల్లాగ?

మిర్జా—ఇంటి కెళ్లే వేళ కానియ్యండి. ఆలోచిద్దాం. ఇది రాజు! దెబ్బతో ఆట కట్టు.

సైన్యం పదిగంట లయ్యేసరికి వెళ్లిపోయింది. మన మిత్రులు కొత్తఎత్తు ప్రారంభించారు.

మిర్జా—ఇవ్వేళ భోజనం ఎల్లాగు?

మీర్—ఉపవాసమే. మీ కేమైనా ఆకలిగా ఉందా?

మిర్జా—అది కాదు. ఊళ్లో ఏమవుతుందో మరి.

మీర్—ఊళ్లో ఏమవుతుంది? ఏమీ కాదు. అంతా భోజనం చేసి విశ్రాంతిగా మంచాలమీద దొర్లుతుంటారు. నవాబుగారు కేళీమందిరంలో ఉండి ఉంటారు.

చతురంగం ఎత్తుమీద ఎత్తేసేసరికి మూడుగంటలయింది. మిర్జాజీఆట నీరసంలో పడిపోయింది. నాలుగుగంటలు కొడుతుండేటప్పటికి ఇంగ్లీషుసేనలు తిరిగొచ్చేస్తున్నాయి. అదే కోలాహలం వినిపించింది. వజీదాలీషా పట్టుబడ్డాడు. కంపెనీసేన లాయన్ని ఎక్కడకో తీసుకుపోతున్నారు. నగరంలో ఏవిధమైన ఆందోళనా, పోరాటం కనబడడం లేదు. ఒక్క రక్తపుచుక్క నేలబడలేదు. ఇంతవరకూ ఏ స్వతంత్రరాజుయొక్క పతనంకూడా ఇంత ,రక్తపాతరహితంగా జరిగిఉండలేదు. ఇందుకు కారణం ముక్కోటిదేవతలూ హర్షించే అహింసాదీక్ష కాదు. కేవలంపిరికితనం. కత్తిలేని పిరికితనం. అయోధ్యవంటి విశాలదేశానికి నవాబుగానున్నవాడిని ఖైదుచేసి పట్టుకుపోతుంటే 'కిం'అనేవాడు లేదు. లక్నో సుఖంగా భోగనిద్రలో పడుంది. రాజకీయపతనానికి ఇంతకన్న అధోగతి ఉండదు.

మిర్జా—ఏమండోయి, నవాబుగారిని శత్రువులు ఖైదీగా పట్టుకుపోతున్నారు.

మీర్—పట్టుకెళ్లనివ్వండి...ఇదిగో రాజు.

మిర్జా—ఏమిటండీ! కొంచెం నిదానించండి. మన స్సిక్కడ నిలువడం లేదు. పాపం! నవాబు గొల్లున గోలపెట్టి ఉంటాడు.

మీర్—ఏడ్చేఉండాలి! ఈ భోగం అక్కడెక్కడనుంచి వస్తుంది?......ఇదిగో రాజు.

మిర్జా—ఎవడికీ రోజులన్నీ ఒక్కగతిగా వెళ్లవుకదా!......దిక్కుమాలిన జీవితం.

మీర్—అంతే. అవును...ఈసారి కాసుకోండి రాజు! ఇంకోఎత్తులో ఆటకట్టు.

మిర్జా—ఓయి నీరాజు దొంగలుదోలా! నీవెంత కఠినుడ వయ్యా! అలాంటి ఘోరం చూస్తూంటే దుఃఖం రావడం లేదూ? అయ్యో! పాపం! వళీదాలీ!

మీర్—అయ్యా! ముందు మీపాదుషాను రక్షించుకోండి, తర్వాత ఆపాదుషాగతి ఆలోచిద్దురుగాని... ఇదిగో రాజు...ఆటకట్టు.

నవాబును పట్టుకుని సేన కళ్ల ముందరనుంచి వెళ్లిపోయింది. మిర్జా మళ్లీ బలం అమర్చేడు. ఓటమి మనస్సును కుమిలించేస్తోంది.

"సరే రండి. నవాబుపరాజయానికి ఒక్క ఏడుపు ఏడ్చేశాంగా?" అనేశాడు. మిర్జారాజభక్తి తన పరాజయంలో లీనమైపోయింది. తన ఓటమికి ప్రతీకారం చేయాలనే దృఢసంకల్పంలో పడ్డాడు.

౪

సాయంకాలమైంది. ఆ పాడుగడ్డల్లో నక్కలు కూయడం ఆరంభించాయి. గబ్బిలాలు తమతమ గూళ్లల్లో చేరుకుంటున్నాయి. ఇద్దరు చతురంగ యోధులున్నూ అతిపట్టుదలతో ఆడుతున్నారు. ఒకళ్ల రక్తం ఒకళ్లు త్రాగడానికి సిద్ధంగా ఉన్నారా అనేటంత పట్టుదలగా కూచున్నారు. మిర్జాజీ వరుసగా మూడాటలు ఓడిపోయాడు. నాల్గవ ఎత్తువైఖరికూడా బాగా లేదు. అనేకసార్లు నిలద్రొక్కుకుని తప్పకుండా గెలిచితీరాలనే దీక్షతో ఆడుతున్నాడు. కాని ప్రతిసారీ ఏదో విఘాతం వచ్చిపడుతోంది. ఆటబిగి తప్పిపోతోంది. ఓడిపోయినప్పుడల్లా కసితీర్చుకోవాలనే అభిలాషకూడా ఎక్కువైపోతోంది. మీర్‌సాహేబు విజయగర్వంతో కూనిరాగాలు తీస్తున్నాడు. మహాభాగ్యం సిద్ధించినట్లు సంతోషిస్తూ చిటికెలేస్తున్నాడు. ఆ చిటికెలు వింటూంటే మిర్జాఒళ్లు మండిపోతోంది. పరాజయంవల్ల కలుగుతుండే దురభిమానాన్ని కనుపించకుండా చెయ్యడానికి ఎన్నివిధాల ప్రయత్నం చెయ్యాలో అన్నివిధాలా చేశాడు. కాని బాజీబలం తగ్గినకొద్దీ ధైర్యం సడలిపోతూవచ్చింది. చివరికి మాటా మాటాదాకా వచ్చింది.

"ఏమండోయి. వేసినెత్తు తియ్యకండి మరి... మొదట్లో ఎత్తు వేశారు. మళ్లీ తీసుకుంటారేం? వెయ్యదలచుకున్న ఎత్తొక్కసారే వేసెయ్యండి..... జంతువుమీద చెయ్యల్లా పెట్టుకునికూర్చుంటే ఏమిటర్థం? మొహరామీద చెయి తియ్యండి. ఎత్తు తోచకపోతే తోచినతర్వాతే మొహరామీద చెయ్యి వెయ్యండి. ఒక్కొక్క ఎత్తేసేసరికి అరగంట అవుతోంది. అది ఆటసబబు కాదు. ఎత్తు కయిదునిముషాలకన్న ఎక్కువయితే ఓడిపోయినట్లే......మళ్లీ ఎత్తు మారుస్తున్నారు. ముందా జంతువు నక్కడ పెట్టండి."

మీర్‌సాహేబుమంత్రి పోతోంది...... "నేనింకా ఎత్తువెయ్యందే" అన్నాడు.

మిర్జా—అబ్బే...! ఎత్తు వేసేశారు. ముందు జంతువు నక్కడ పెట్టండి...ఆ ఇంట్లోనే...

మీర్—ఆ ఇంట్లో ఎందుకు పెట్టాలి? జంతువుమీద చెయ్యి నేను తియ్యందే?

మిర్జా—చెయ్యి మీరు ఎప్పుడూ తియ్యరు. ఎంత ప్రళయ మొచ్చినాసరే. ఇక ఆట సాగేదేమిటి? మంత్రి పోతోంది. అందుచేత ఈమోసం చేస్తున్నారు.

మీర్—ఏమండోయి, మాటలు సరిగా రానియ్యండి. మోసం మీది. జయాపజయాలు దైవాధీనం అన్నారు. మోసంవల్ల ఎవరూ గెలవరు.

మిర్జా—అయితే ఈ ఆట మీరోడిపోయినట్లే.

మీర్—నే నెందు కోడిపోయాను?

మిర్జా—అయితే మీరు జంతువును ఏ యింట్లోంచి తీశారో ఆయింట్లో పెట్టండి.

మీర్—అక్కడెందుకు పెట్టాలి? పెట్టను.

మిర్జా—ఎందుకు పెట్టరు? పెట్టితీరాలి.

తగాదా పెరిగిపోయింది. ఎవరి పట్టు వారిదే. ఉభయులూ దిగలేదు. అప్రస్తుత ప్రసంగాలు ఆరంభమైనాయి.

మిర్జా—ఎవడికైనా పెద్ద లెప్పుడైనా చతురంగంమొహం ఎరిగుంటే ఆటసాంప్రదాయాలు తెలుస్తాయి. గడ్డికోసుకు బ్రతికినవాళ్లు చతురంగంమొహమే మెరుగుదురు? జమీందార్లైతేనేమి? జాగీరుంటేనేమి? ఫామేదా ఎక్కడనుంచి వస్తుంది?

మీర్—ఏమిటీ? మీ బాబు గడ్డికోసుకు బ్రతికేడేమో? మా ఇంట్లో తరతరాలుగా ఆడుతున్నాం చతురంగం.

మిర్జా—వెళ్లవయ్యా! చెప్పేవు కబుర్లు. గాజీయుద్దీన్ హైదర్ దగ్గర వంటచేసుకుని కాలక్షేపం చేశారు. ఇప్పుడు పెద్ద జమీందారులైపోయారు. జమీందారు లవడం అంటే అల్లాటప్పా వ్యవహారం కాదు.

మీర్—ఎందుకు మీ పెద్దల ముఖాని కల్లా మసిపూసుకుంటారు. మీవాళ్లు వంటలు చేసేరేమో కాని మావాళ్లెప్పుడూ పాదుషాసహపంక్తిని భోజనం చేస్తూనే వచ్చారు.

మిర్జా—వెళ్లవయ్యా, ఆస్టే సొర కాయకోతలు కోయకు. గొప్పకబుర్లు చెపుతున్నావే!

మీర్—కాస్త నోరు సంబాళించుకోండి. మాటలు జాగ్రత్తగా రానివ్వండి. లేకపోతే బాగా జరుగదు. గ్రుడ్లెర్రచేస్తే గ్రుడ్లు తోడేస్తాను! నామర్దా మాటలు సహించలేను. ఎవరైనా సరే. నాలుక తోడేస్తాను ......ఏమనుకున్నావో తడాఖా!

మిర్జా—నా తడాఖా చూస్తారా ఏమిటి? అయితే రండి. అయిసా పైసా తేలిపోవాలి.

మీర్—ఈకబుర్లకు జాలైపోయేవా ళ్లెవ్వరూ లేరు ఇక్కడ.

స్నేహితు లిద్దరూ కత్తులు తీశారు. అది నవాబుల కాలం. తల్వార్లు, పేష్‌కబ్జ్‌లు, కటార్లూ మనుష్యుల వంటిమీద ఉండేవి. ఇద్దరూ అవడానికి భోగపరాయణులే కాని పిరికివాళ్లుమాత్రం కారు. పాదుషాకోసం చావడ మెందుకనుకున్నారుకాని, తమ వ్యక్తిపౌరుషాన్ని ప్రదర్శించడానికి మాత్రం సంకోచించలేదు. ఇద్దరూ కత్తులు దూసి ఒకళ్లమీద ఒకళ్లు దూకేరు. కత్తులు ఝుణఝుణలాడేయి. 'టప్'మని శబ్దం అయింది. ఇద్దరూ వ్రేట్లు తిని క్రింద పడ్డారు. గిలగిల కొట్టుకుని ప్రాణాలు వదిలేరు.

పాదుషా ప్రాణాలు పోతుంటే ఇద్దరి కళ్లనుంచీ ఒక్క కన్నీటిబిందువైనా రాలలేదు. కాని చతురంగంలో మంత్రిప్రాణంకోసం తమ ప్రాణాలను అర్పించేశారు!

చీకటి కమ్ముకుపోయింది. చతురంగంపావులు అమర్చిన వమర్చినట్లుగానే ఉన్నాయి. ఈ వీరుల కోసం ఏడుస్తున్నారా అన్నట్లు చతురంగంలోని రాజులు తమ తమ సింహాసనాలమీద కూచునే ఉన్నాయి.

అంతా నిశ్శబ్దమైపోయింది. ఆ శిథిలాల్లో పడిపోయిన గోడలు, విరిగిన బురుజులు, కూలిపోయిన లాజులు ఆ శవాలను చూస్తూ తలలు వంచుకున్నాయి.

('ప్రేమచందు' నుండి)